ఆదర్శ పాఠశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జక్రాన్‌పల్లి, జనవరి 23: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువు కోవడానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 విద్యసంవత్సరానికి 6, 7, నుంచి పదో తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.



భూ రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం నజర్

- జిల్లాలో ధరణి ద్వారా రిజిస్ట్రేషన్ అయిన అసైన్డ్, ఇతర భూములపై వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం
- కోదండ రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ
- ధరణి పనితీరును సమీక్షిస్తున్న కమిటీ సభ్యులు
- భూములు పక్కదారి పడితే చర్యలు చేపట్టే అవకాశం

నిజామాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ప్రభుత్వ భూములపై కొత్త ప్రభుత్వం నజర్ పెట్టింది. జిల్లాలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు, ఇతర శాఖల భూముల వివరాలను సేకరిస్తోంది. ధరణి ద్వారా అసైన్డ్ భూములు ఎవరి పేరు మీదనైనా పట్టాగా మారాయో ఆరా తీయడంతో పాటు గతంలో కేటాయించిన వారి కుటుంబ సభ్యుల చేతుల్లోనే ఈ భూములు ఉన్నాయా అనే వివరాలను తీసుకుంటున్నారు. ప్రధాన రహదారుల వెంట ఉన్న విలువైన భూములు చేతులు మారాయా? ఒకవేళ అవి ఇతరుల చేతికి వెళితే ధరణి వచ్చిన తర్వాత ఎంత మేర పట్టాలుగా మారాయో వివరాలను ఆరా తీస్తున్నారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించడంతో పాటు విలువైన భూములు చేతులు మారితే చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ నగరం చుట్టూ ఉన్న భూములతో పాటు ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీలు, జాతీయ, రాష్ట్ర రహదారుల వెంట ఉన్న భూముల వివరాలను సేకరిస్తున్నారు. అవసరమైతే భూములు పక్కదారి పట్టించిన వారిపై చర్యలు తీసుకునేందుకు కూడా సిద్ధమవుతున్నట్లు సమాచారం.

'ధరణి' పనితీరుపై కమిటీ

రాష్ట్ర ప్రభుత్వం ధరణి పనితీరుపై సీనియర్ నేత మాజీ మంత్రి కోదండరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ధరణి పనితీరును కమిటీ సభ్యులు సమీక్షిస్తున్నారు. ధరణిలోని లోటుపాట్లను గుర్తించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అసైన్డ్ భూములు విలువైన ప్రభుత్వ భూములు చేతులు మారాయా అని పరిశీలిస్తున్నారు. పూర్తిస్థాయిలో అన్ని జిల్లాల నుంచి వివరాలను తీసుకుంటూ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ధరణినే ప్రక్షాళన చేయడంతో పాటు కీలకమైన అంశాలను మార్చనున్నారు.

మూడేళ్ల క్రితం 'ధరణి'

ధరణిని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం అమల్లోకి తీసుకువచ్చింది. ధరణి ద్వారా మండల స్థాయిలోని వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లకుండానే భూముల రిజిస్ట్రేషన్‌తో పాటు మ్యుటేషన్, ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ధరణి ద్వారా మొత్తం పనులను చేయడంతో పాటు కొనుగోలు చేసిన వారికి పాస్‌బుక్‌లను అందిస్తున్నారు. ధరణి అమల్లోకి వచ్చేముందు భూముల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గ్రామస్థాయిలో వివరాలు నమోదు చేసే సమయంలో కొన్ని భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. మరికొన్ని భూములను వ్యవసాయేతర భూములుగా నమోదు చేశారు. కొన్ని భూములను నమోదు చేసే సమయంలో రైతు పేరు తప్పుగా ఎంట్రీ చేశారు. వీటి కోసం రైతులు ఏళ్లతరబడి తహసీల్దార్, కలెక్టర్, సీసీఎల్ఏ వరకు తిరుగుతున్నారు. తప్పుగా నమోదు చేసిన వివరాలు సరిదిద్దేందుకు తిప్పలు పడుతున్నారు. కొంత మంది రైతులవి అవుతున్నా మరికొంత మంది రైతులవి కావడం లేదు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలను తొలగించకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. వ్యవసాయ భూములు నిషేధిత జాబితాలో ఉండటం వల్ల రైతులకు రైతుబంధు రావడం లేదు. పంట రుణాలు అందడం లేదు. గతంలో వ్యవసాయ రుణాలు తీసుకోవడంతో పాటు పాస్‌బుక్‌లు ఉండటం వల్ల అన్ని రకాల రాయితీలను పొందారు. ధరణిలో కిందిస్థాయిలోనే మార్పులు చేసేందుకు అవకాశం లేకపోవడం వల్ల ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితులను ప్రస్తుతం కోదండరెడ్డి ఆధ్వర్యంలోనే కమిటీ పరిశీలిస్తుంది. ధరణి ద్వారా గతంలో పేదలకు కేటాయించిన కొన్ని అసైన్డ్ భూములు చేతులు మారాయి. ఉమ్మడి జిల్లాలో 1970 నుంచి ఇప్పటి వరకు సుమారు రెండున్నర లక్షల ఎకరాల వరకు భూములను పేదలకు అందించారు. భూమి లేని నిరుపేదలకు ఎకరం నుంచి మూడు ఎకరాల వరకు కేటాయించారు. కొంత మందికి అంతకుమించి కూడా భూములను ఇచ్చారు. ఈ భూములను కేటాయించిన వారే సాగు చేసుకోవాలి. వారి కుటుంబ సభ్యులకు మాత్రమే వినియోగించుకోవాలి.

భారీగా పెరిగిన భూముల ధరలు

భూముల ధరలు పెరగడం జిల్లాలో పంటలు ఎక్కువగా పండటం వల్ల అసైన్డ్ భూములకు ధరలు భారీగా పెరిగాయి. నిజామాబాద్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్ మున్సిపాలిటీల పరిధిలో కేటాయించిన భూములకు భారీగా ధరలు వచ్చాయి. ఈ పదేళ్లలో ఈ మూడు పట్టణాల్లో భూముల అమ్మకాలు పెరగడంతో పాటు రియల్ ఎస్టేట్ పెరగడం వల్ల ఎక్కువగా అసైన్డ్ భూములు చేతులు మారాయి. ధరణి వచ్చిన తర్వాత ఈ మూడు మున్సిపాలిటీల పరిధితో పాటు జాతీయ, రాష్ట్ర రహదారుల వెంట ఉన్న భూములే కాకుండా మండల కేంద్రాల్లో ఉన్న భూములు కూడా ఎక్కువగా ఇతరుల చేతుల్లోకి వెళ్లాయి. ధరణి ద్వారా కొన్ని భూములు కూడా రిజిస్ట్రేషన్లు అయ్యాయి. కొన్ని భూములను నిషేధిత జాబితా నుంచి తీసివేయడం వల్ల ఇతరుల చేతుల్లోకి వెళ్లాయి. అసైన్డ్ చట్టం ప్రకారం ఆ భూములు తీసుకున్న వారు చనిపోతే వారి కుటుంబ సభ్యులే వినియోగించుకోవాలి. పంటలు పండించుకోవాలి. ఇతరులకు అమ్మకాలు చేయవద్దు.

పదేళ్లుగా చేతులు మారిన భూములు

గడిచిన పదేళ్లుగా ఈ భూములు భారీ ఎత్తున చేతులు మారాయి. గత ప్రభుత్వ హయాంలో కొంత మంది నేతల చేతుల్లో కూడా ఈ భూములు వెళ్లాయి. వీటన్నింటి వివరాలను కొత్త ప్రభుత్వం సేకరిస్తున్నట్లు సమాచారం. రెవెన్యూ ద్వారా వివరాలను తీసుకోవడంతో పాటు కొన్ని భూముల వివరాలను ఇతర ఏజెన్సీల ద్వారా సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ భూములే కాకుండా దేవాదాయ, అటవీ, ఇరిగేషన్ శాఖలకు సంబంధించిన భూములు కూడా పక్కదారి పట్టడంతో ఆ వివరాలను కూడా తీసుకుంటున్నట్లు సమాచారం. వీటన్నింటి వివరాలను తీసుకోవడంతో పాటు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వం వివరాలు అడగడంతో జిల్లా నుంచి కూడా పంపిస్తున్నట్లు తెలుస్తోంది. కోదండరెడ్డి కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా అసైన్డ్ భూములతో పాటు ఇతర భూములపై నజర్ పెట్టే అవకాశం ఉంది. చేజారిన భూములను కూడా మళ్లీ తీసుకొని ఇతరులకు కేటాయించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాల సమాచారం బట్టి తెలుస్తోంది.

పసుపు రైతులను ఆదుకునేందుకు చర్యలు

మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం..



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ప్రధాన శాఖల ఆధ్వర్యంలో సమీక్షకు మంత్రి తుమ్మల ఆదేశాలు
- కలెక్టర్ ఆధ్వర్యంలో రెండు రోజుల్లో సమావేశం నిర్వహణ

నిజామాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని పసుపు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆధ్వర్యంలో అధికారులు, వ్యాపారులు, రైతు సంఘాల నేతల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రధాన శాఖల అధికారులతో సమీక్షించి నిర్ణయం తీసుకోనున్నారు. ప్రస్తుతం ఉన్న పసుపు ధరను కొనసాగించడంతో పాటు డిమాండ్‌కు అనుగుణంగా రైతులకు ధర వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

స్పందించిన సర్కార్

జిల్లాలో తగ్గిన పసుపు సాగు, మద్దతు ధర కోసం రైతుల చూపు అనే అంశంపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ప్రభుత్వం స్పందించింది. రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు దృష్టికి తీసుకువెళ్లడంతో అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మార్కెటింగ్, ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారులతో పాటు పసుపు కొనుగోలు చేసే వ్యాపారులు, రైతుల సంఘాలతో సమీక్షించాలని కలెక్టర్‌ను కోరారు. రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్‌రెడ్డితో పాటు ఇతర నేతలు సమీక్షలో పాల్గొనడంతో పాటు ప్రభుత్వం తరఫున రైతులకు కావాల్సిన మద్దతు ధర వచ్చే విధంగా చర్యలను తీసుకోనున్నారు.

రెండు రోజుల్లో సమావేశానికి ఏర్పాట్లు

రెండు రోజుల్లో సమావేశం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. మొదట ఉద్యానవన, మార్కెట్ కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ శాఖ అధికారులతో పాటు వ్యాపారులతో సమీక్షిస్తారు. ఈ వివరాల ఆధారంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆధ్వర్యంలో మరో దఫా సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారు. ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంతో పాటు రైతులకు ప్రస్తుతం ఉన్న ధర కొనసాగే విధంగా ఏర్పాట్లను చేస్తారు. ప్రభుత్వం తరఫున పసుపు రైతులను ఆదుకునేందుకు చర్యలను చేపట్టనున్నారు. పసుపు సాగు తగ్గి దిగుబడి కూడా అంతేమాత్రం ఉండటం, ధర తగ్గితే రైతులు ఇబ్బంది పడే అవకాశం ఉండటంతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో పసుపు రైతులను ఆదుకుంటామని ప్రకటించడంతో ఈ సమీక్ష తర్వాత ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు చేపట్టే అవకాశం ఉంది. వ్యవసాయ శాఖ తరఫున మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశాలతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్ రెడ్డి తెలిపారు. సమావేశం తర్వాత ధరలను సమీక్షించడంతో పాటు తగ్గకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మూడేళ్ల క్రితం కొట్టుకుపోయిన మోర్తాడ్ శివారులోని బ్రిడ్జి ఇలా..

బ్రిడ్జి కూలినా పట్టించుకోరా?

- మొండివాగు ఉధృతికి కొట్టుకుపోయిన రైల్వే బ్రిడ్జి
- ఇబ్బంది పడుతున్న రైలు ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

మోర్తాడ్, జనవరి 23: మండల కేంద్రంలోని జాతీయరహదారి రైల్వేస్టేషన్ మధ్యలో ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోయి మూడేళ్లు దాటినా రైల్వే శాఖ అధికారులు స్పందించడంలేదు. రైల్వే శాఖ నిర్మించిన బ్రిడ్జి మూడేళ్ల క్రితం భారీ వర్షాల వల్ల మొండి వాగు ఉధృతికి కొట్టుకుపోయింది. ఈ బ్రిడ్జి కొట్టుకుపోవడం రెండోసారి. మోర్తాడ్ బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లాలన్న రహదారి మీదుగానే వెళ్లాలి. బ్రిడ్జి కూలిపోవడంతో రైలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులు రైల్వే స్టేషన్‌లో వెళ్లి మోర్తాడ్ బస్టాండకు రావాలన్నా వాగులోకి దిగి రావాల్సిన పరిస్థితి ఉంది. దీంతో రైల్వే స్టేషన్‌కు వెళ్లాలన్నా- బస్టాండ్‌కు రావాలన్నా రాలేని పరిస్థితి ఏర్పడింది. రైల్వేశాఖ అధికారులు బ్రిడ్జి నిర్మాణం పొడవుగా నిర్మించకపోవడం వల్ల వాగు నుంచి బ్రిడ్జిని కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. రైల్వే అధికారులు మొండివాగుపై భారీ బ్రిడ్జి ఏర్పాటు చేస్తేనే వరద ఉధృతికి తట్టుకొని నిలబడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. బ్రిడ్జి నిర్మాణంపై ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రైస్‌మిల్లు నిర్వాహకుడి సోదరుడిని విచారిస్తున్న సీఐ

రైస్‌మిల్లుపై అధికారుల దాడులు

- అభంగపట్నం రైస్ మిల్లు సీజ్
- కస్టం మిల్లింగ్ బియ్యం ఎగవేతపై కేసు నమోదు చేసిన పోలీసులు

నవీపేట, జనవరి23: మండలంలోని అభంగపట్నం యునస్ ట్రేడర్ రైస్ మిల్లుపై మంగళవారం సాయంత్రం అధికారులు దాడులు నిర్వహించారు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ అశ్వక్ హైమద్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అభంగపట్నం రైస్ మిల్లును నిజామాబాద్‌కు చెందిన మహమ్మద్ యునస్ లీజుకు తీసుకుని నడిపిస్తున్నాడు. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 35వేల క్వింటాళ్ల ధాన్యాన్ని సంబంధిత రైస్ మిల్లుకు కస్టం మిల్లింగ్‌కు అప్పగించారు. ఇందులో కొంత బియ్యాన్ని నిర్వాహకులు ప్రభుత్వానికి అప్పగించగా మరో 26వేల క్వింటాళ్ల ధాన్యానికి సంబంధించిన కస్టం మిల్లింగ్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. దీని విలువ 6,18,63,368 రూపాయలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఇటీవల రైస్ మిల్లును ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేయగా అందులో ధాన్యం కనిపించలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సోమవారం సాయంత్రం నిజామాబాద్ జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ జగదీష్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ అశ్వక్ అహ్మద్, నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్, నవీపేట ఎస్ఐ యాదగిరి గౌడ్‌ల ఆధ్వర్యంలో రైస్ మిల్లుపై దాడులు నిర్వహించి తనిఖీలు చేపట్టారు. సంబంధిత రైస్ మిల్లులో కస్టం మిల్లింగ్‌కు సంబంధించిన ధాన్యం కనిపించకపోవడంతో అక్కడే ఉన్న రైస్ మిల్లు నిర్వాహకుడి సోదరుడిని అధికారులు ప్రశ్నించి వివరాలు సేకరించారు. నిజామాబాద్ జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ జగదీష్ ఆధ్వర్యంలో రైస్ మిల్లు సీజ్ చేసి నిర్వాహకుడు మహ్మద్ యునస్‌పై నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మహ్మద్ యునస్‌పై కేసు నమోదు చేశామని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్ పేర్కొన్నారు.



బోదేపల్లి లిఫ్ట్ నుంచి నీటి విడుదల

ముప్కాల్, జనవరి 23: బాల్కొండ మండలంలోని బోదేపల్లి ఎత్తిపోతల పథకం నుంచి మంగళవారం నీటిని వదిలారు. యాసంగి సాగు కోసం బాల్కొండ చెరువును నింపేందుకు నీటి విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లిఫ్ట్ ఏఈ శేఖర్, గ్రామపెద్దలు బల్ల నర్సయ్య, కిషన్, తోట నాగన్న, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ కార్యాలయంలో టీటీసీ ఉత్తీర్ణత సర్టిఫికెట్‌లు

నిజామాబాద్ అర్బన్, జనవరి 23 : గత ఏడాది ఆగస్టులో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, హిందుస్తాని, కర్నాటక మ్యూజిక్)కు సంబంధించిన ఉత్తీర్ణత సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులు నూతన కలెక్టరేట్‌లోని రూమ్ నంబరు. 103లో హాల్‌టికెట్, ఆధార్ కార్డు జిరాక్సులు సమర్పించి ఉత్తీర్ణత సర్టిఫికెట్ పొందాలన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో చిత్రలేఖనం పోటీలు



పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 23 : నగర శివారులోని కేంద్రియ విద్యాలయంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి-పరాక్రమ్ దీవస్‌లో భాగంగా పరీక్షపే చర్చ 2024పై ఇంటర్ స్కూల్ చిత్రలేఖనం పోటీలను మంగళవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వివిధ పాఠశాలలకు చెందిన 9-12 తరగతులకు చెందిన వందలాది మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. విద్యార్థులకు చిత్రలేఖనంకు సంబంధించిన సామాగ్రిని కేంద్రీయ విద్యాలయం వారు అందించారు. ఈ పోటీలలో బోర్గాం(పి) జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.సుమీశ మొదటి స్థానంలో నిలువగా, బోధన్ కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న డి.పర్ణిక రెండవ స్థానం, జెడ్పీహెచ్ఎస్ బోర్గాం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న హిందు మూడవ స్థానం, ఏహెచ్‌వీ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మనోజ్ నాల్గవ స్థానంలో, బోర్గాం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మధుప్రియ ఐదవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు విద్యార్థులకు ప్రశంసాపత్రంతో పాటు ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాలను అందించి అభినందించారు.





నకిలీ 'పోచంపల్లి'!

- పోచంపల్లి ఇక్కత్ పేరిట ప్రింటింగ్ చీరలు
- భూదాన్‌పోచంపల్లిలో విజిలెన్స్ తనిఖీలు
- 200 ప్రింటింగ్ చీరలు సీజ్
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: పోచంపల్లి ఇక్కత్ పేరిట విక్రయిస్తున్న 200 ప్రింటింగ్ చీరలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.30వేల విలువైన చీర రూ.1,200, రూ.7 వేల విలువైన చీర రూ.300కే విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ పేరుతో నకిలీ పట్టు చీరలు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో తెలంగాణ ఎన్‌ఫోర్స్‌మెంట్, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని వస్త్ర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సూరత్ తదితర ప్రాంతాల నుంచి ప్రింటింగ్, పవర్‌లూమ్ మిల్లులపై తయారైన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలుగా విక్రయిస్తున్న దుకాణదారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి వస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ - ఏకేఎల్‌బీ హ్యాండ్లూమ్ మార్కెట్‌లోని పలు వస్త్ర దుకాణాలను పట్టణంలోని ప్రధాన రహదారిపై గల మరికొన్ని వస్త్ర దుకాణాలపై దాడులు జరిపి నకిలీ చీరలు, ప్రింటింగ్ చీరలు, మిల్లు వస్త్రాలను సీజ్ చేశారు. పట్టణంలోని 12 దుకాణాల నుంచి సుమారు 200 ప్రింటింగ్ చీరలను స్వాధీనం చేసుకున్నారు. చేనేత రిజర్వేషన్ యాక్ట్‌ను ఉల్లంఘించడంతో పాటు పోచంపల్లి ఇక్కత్ చీరల డిజైన్లను ప్రింటింగ్ చేసిన వస్త్రాలను విక్రయించడం నేరమని వెంకటేశం చెప్పారు. చేనేత రక్షణ చట్టం సెక్షన్-6 కింద వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్-జీఐఏ (పేటెంట్ హక్కులు) కలిగిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల డిజైన్లను కొందరు బడా మిల్లు వ్యాపారులు ప్రింటింగ్ చేసి అతి చౌక ధరకు విక్రయిస్తూ తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఇటీవల భూదాన్‌పోచంపల్లి సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు చేనేత కార్మికులు విన్నవించుకున్నారు. ఇదే సమస్యపై 'పేటెంట్‌కు పోటు.. చేనేతకు చేటు' శీర్షికన ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. నకిలీ చీరల విక్రయాలను నియంత్రించాలని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశం చెప్పారు.


వస్త్ర దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం

అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు

భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో నెగ్గిన తీర్మానాలు

- అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు
- కొత్తగూడెంలో అవిశ్వాసానికి కలెక్టర్‌కు వినతి పత్రం
- మీర్‌పేటలోనూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపాలిటీలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపల్ రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. భువనగిరి జిల్లా భువనగిరి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో మంగళవారం పెట్టిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. భువనగిరి మునిసిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా, స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 15, కాంగ్రెస్‌కు 11, బీజేపీకి 7, ఇతరులు ఇద్దరు గెలిచారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ తరఫున 20, కాంగ్రెస్ నుంచి 9, బీజేపీ నుంచి ఆరుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అవిశ్వాస తీర్మానానికి వీరిలో 31 మంది హాజరయ్యారు. తీర్మానాన్ని బలపరుస్తూ అంతా (బీఆర్‌ఎస్ 16, కాంగ్రెస్ 9, బీజేపీ 6) చేతులెత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. సమావేశానికి చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు వారికి మద్దతుదారులైన ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వ్యక్తిగత కారణాల పేరిట తీర్మానానికి ముందే చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య తమ పదవులకు రాజీనామా చేశారు. అలాగే, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ జయబాబుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇక్కడ మొత్తం 15 వార్డులు ఉండగా.. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, సీపీఎం నుంచి ఒకరు గెలుపొందారు. తాజా రాజకీయ పరిణామాల్లో బీఆర్‌ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి 10 మంది, సీపీఎం నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి హాజరైన 13 మందీ చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో చైర్మన్ జయబాబుపై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల సంఘం నుంచి అనుమతి వచ్చిన అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో చైర్మన్లు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడం గమనార్హం. ఇక, కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిని తొలగించేందుకు అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని కోరుతూ 22 మంది కౌన్సిలర్లు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డా. ప్రియాంక అలాకు వినతి పత్రం అందజేశారు. అలాగే, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేటలోనూ అవిశ్వాసానికి రంగం సిద్ధమవుతోంది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ నుంచి ముగ్గురు సభ్యులే గెలిచారు. వారిలో ఒకరు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ తరఫున 19 మంది, బీజేపీ తరఫున 16 మంది గెలిచారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముగ్గురు బీఆర్‌ఎస్, ఒక ఇండిపెండెంట్, మరో బీజేపీ సభ్యుడు కాంగ్రెస్‌లో చేరారు. దాంతో, ఆ పార్టీ బలం ఏడుకు చేరింది. బీజేపీకి ప్రస్తుతం 14 మంది సభ్యులు ఉన్నారు. తాజాగా, కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ప్రతిపాదిస్తున్న అవిశ్వాస తీర్మానానికి బీఆర్‌ఎస్‌లోని మెజారిటీ సభ్యులు కూడా అంతర్గతంగా మద్దతు తెలుపుతున్నట్లు సమాచారం. అవిశ్వాసం నెగ్గితే బీజేపీకి మేయర్, కాంగ్రెస్‌కు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని ఒప్పందం సైతం చేసుకున్నట్లు తెలిసింది.

యువకుడి చేతిలో పేలిన బాణసంచా

నేరేడుచర్లలో అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత బయట కొందరు యువకులు బాణసంచా కాల్చారు. నేరేడుచర్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త అరిగెల రవి బాణసంచా కాల్చుతుండడంతో పొరపాటున అది చేతిలో పేలడంతో కుడిచేతి వేళ్లు తెగిపోయాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.

అవిశ్వాసాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు

- హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన మునిసిపల్ చైర్‌పర్సన్‌లు
- ప్రభుత్వానికి నోటీసులు జారీ



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను అడ్డుకోవాలని కోరుతూ పలు మునిసిపాలిటీల చైర్‌పర్సన్‌లు, నగరాల మేయర్‌లు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఇప్పటికే సింగిల్ జడ్జి వీరి పిటిషన్‌లను కొట్టేయడంతో ఆ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌లను మంగళవారం విచారణకు స్వీకరిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన ప్రక్రియను అడ్డుకోవాలని కోరుతూ సదాశివపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పి. జయమ్మ, జనగాం మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, ఆంథోల్‌జోగిపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గూడెం మల్లయ్య, ఆలేరు మునిసిపల్ చైర్‌పర్సన్ వి. శంకరయ్య, జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. పిటిషనర్‌ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్ రెడ్డి వాదనలు వినిపిస్తూ తెలంగాణ మునిసిపాలిటీస్ యాక్ట్ - 2019 సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మానాన్ని ఎలా ఆమోదించాలన్న విధానాన్ని పేర్కొనలేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యల ప్రస్తావన లేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియకు సంబంధించిన స్పష్టమైన రూల్స్ ఆమోదం పొందే వరకు అప్పీలుదారులపై అవిశ్వాస తీర్మానం పెట్టడం చెల్లదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపాలిటీస్ యాక్ట్ - 1965లోని సెక్షన్ 46కు విరుద్ధంగా కొత్త మునిసిపాలిటీ చట్టంలోని సెక్షన్ 37 ఉందని వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం వివరణ ఇవ్వాలని పేర్కొంటూ మునిసిపల్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ కం కమిషనర్, మునిసిపాలిటీలు ఉన్న ఆయా జిల్లాల కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

ఈ నెలాఖరులోనే

'అసెంబ్లీ సమీక్షలు'

- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం
- గులాబి బాసును కలిసిన కేటీఆర్, హరీశ్
- పార్లమెంట్ స్థానాల సమీక్షపై నివేదిక అందజేత

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షను ఈ నెలాఖరులోనే నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఈ మేరకు కేటీఆర్, హరీశ్‌రావుకు నిర్దేశించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బీఆర్‌ఎస్ సమీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సమీక్షల్లో పలువురు నేతలు, కార్యకర్తల నుంచి వచ్చిన సలహాలు, సూచనలతో కూడిన నివేదికను ఇద్దరు నేతలు కేసీఆర్‌కు అందించారు. మంగళవారం వారిద్దరూ ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలపై చర్చ జరిగింది. ఈ సమీక్షలను ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించాలని అనుకున్నా దాన్ని ఇంకొంత ముందుకు జరపాలని నిర్ణయించారు. ఈ నెలాఖరు నుంచే వాటిని ప్రారంభించాలని దానికి తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని కేసీఆర్ సూచించారు. ఈ సమీక్షలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే జరపాలని అనుకున్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు హాజరవుతారు.

గొర్రెల స్కాం నిందితుడికి

హైకోర్టులో ఎదురుదెబ్బ

- క్వాష్ పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకం స్కాంలో నిందితునిగా ఉన్న మేడ్చల్ జిల్లా పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవ సాయికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గొర్రెల పెంపకం పథకంలో అవినీతికి పాల్పడ్డారని, అక్రమంగా తప్పుడు ఖాతాల్లోకి నిధులను మళ్లించారంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టేయడానికి మంగళవారం హైకోర్టు నిరాకరించింది. ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, గొర్రెల ఫిట్‌నెస్ పరిశీలన, సర్టిఫికెట్‌ల జారీ వంటి తనకు కేటాయించిన విధులను మాత్రమే తాను నిర్వహించానని ఆయన తెలిపారు. నిధులకు సంబంధించిన ఏ బాధ్యతలు తనకు లేవని, అందువల్ల కేసును కొట్టివేయాలని కోరుతూ ఏ-4గా ఉన్న ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గత ఏడాది ఆగస్టులో లావాదేవీలు జరిగితే అదే ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత కేసు పెట్టారని పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1పై కఠిన చర్యలు తీసుకోవద్దని ఇదే హైకోర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో తనకు సైతం అవే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఏసీబీ తరఫున న్యాయవాది విద్యాసాగర్ రావు వాదనలు వినిపిస్తూ.. గొర్రెల ట్యాగింగ్, లోడింగ్, ఫొటోగ్రఫీ, పోర్టల్‌లో వివరాల నమోదు వంటి విధులకు పిటిషనర్ బాధ్యుడని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సోమవారం సాయంత్రమే ఈ కేసును ఏసీబీకి అప్పగించినట్టు ప్రభుత్వం పేర్కొందని, ఈ దశలో జోక్యం చేసుకోవడం భావ్యం కాదని పేర్కొంటూ క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది.

కాంగ్రెస్‌లో పోటాపోటీ!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కసరత్తు ముమ్మరం.. నెలాఖరులో పీఈసీ భేటీ.. 2, 3 పేర్లు కేంద్రానికి

- ఖమ్మం నుంచి అయితే సోనియా.. లేకుంటే నువ్వా.. నేనా?
- రేసులో రేణుకా చౌదరి, పొంగులేటి సోదరుడు, ఇతరులూ
- నల్లగొండ, భువనగిరిల్లో ముగ్గురు నేతల ప్రయత్నాలు
- మల్కాజిగిరి సీటుపై కుసుమ్, మైనంపల్లి, ఇతరులూ ఆశ
- నిజామాబాద్‌లో దిల్ రాజు?
- వరంగల్‌లో అద్దంకి దయాకర్?



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో కనీసం 12 సీట్లు గెలుచుకోవాలన్న లక్ష్యంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఆ దిశగా దీటైన అభ్యర్థుల ఎంపికపై కసరత్తును ముమ్మరం చేసింది. సామాజిక సమీకరణలు, గెలుపు అవకాశాలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని పార్టీ ముఖ్య నాయకులు ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. నెలాఖరులో జరిగే ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) సమావేశంలో చర్చించి.. నియోజకవర్గానికి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీకి పంపనున్నట్లు చెబుతున్నారు. వీటిలో ఖమ్మం స్థానానికి పోటీ తీవ్రంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలంటూ ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని కోరుతూ టీపీసీసీ ఇప్పటికే తీర్మానాన్ని ఆమోదించి పంపిన సంగతి తెలిసిందే. ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలా.. వద్దా అన్న సందిగ్ధంలో సోనియా ఉన్నట్లు చెబుతున్నారు. పోటీకి ఆమె అంగీకరిస్తే ఖమ్మం నుంచే పోటీ చేయించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చింది. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని ఆమె నిర్ణయించుకుంటే ఇక్కడ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఖమ్మం టికెట్ తనకే దక్కుతుందన్న ధీమాతో కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఉన్నారు. మరో వైపు, తన సోదరుడు ప్రసాద్‌రెడ్డికి ఖమ్మం టికెట్ ఇప్పించుకునేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వర్‌రావు, పాలేరు నియోజకవర్గ నేత రాయల నాగేశ్వర్‌రావు తదితరులూ తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక, అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టికెట్ దక్కని పటేల్ రమేశ్ రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ టికెట్ హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచి పోటీకి తాను సిద్ధమని మాజీ మంత్రి జానారెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఆయనకు నల్లగొండ టికెట్ ఇస్తే.. రమేశ్ రెడ్డిని భువనగిరి నుంచి పోటీ చేయించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కానీ, భువనగిరి టికెట్‌పైనే ఆశలు పెట్టుకుని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి కొద్ది నెలలుగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ, భువనగిరి సీట్లు ఎట్లా సర్దుబాటు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మల్కాజిగిరి నుంచి టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరిద్దరూ కాకుండా అనూహ్యంగా కొత్త పేర్లు కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉంది. దావోస్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లే ముందు సదరు నేతలు ఆయన్ను కలిసి మల్కాజిగిరి సీటును తమకు కేటాయించాలంటూ కోరారు. ఆ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న తుమ్మల నాగేశ్వర్‌రావునూ వారు కలిసి అభ్యర్థించారు. హైదరాబాద్ నుంచి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత ఫిరోజ్ ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, ప్రముఖ ఫార్మా కంపెనీ అధినేత ఒకరి పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. నిజామాబాద్ నుంచి ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు పేరు ప్రధానంగా పరిశీలిస్తున్నారు. జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబాబాద్ సీటును లంబాడాలకు కేటాయిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ సీటును ఆదివాసీ నేతకు కేటాయించే అవకాశం ఉంది. ఇక, ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలకు సంబంధించి నాగర్‌కర్నూల్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, వరంగల్ నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్ కుమారుడు వంశీ పేర్లు ప్రధానంగా పరిశీలిస్తున్నారు.

రేపు బూత్ లెవల్ ఏజెంట్లతో ఖర్గే సమావేశం

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న కాంగ్రెస్.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించిన బూత్ లెవల్ ఏజెంట్లతో గురువారం ఎల్బీ స్టేడియంలో సమావేశం నిర్వహిస్తోంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం జరగనుంది. దీనికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ ముఖ్య నేతలూ పాల్గొననున్న ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశానికి తరలి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వారికి పిలుపునిచ్చారు.

తెలంగాణలోనే రిచెస్ట్.. రంగారెడ్డి జిల్లా

- 2,3 స్థానాల్లో హైదరాబాద్, సంగారెడ్డి
- తలసరి ఆదాయం ఆధారంగా గుర్తింపు
- తెలంగాణ ఎకానమీ -2023 నివేదిక

హైదరాబాద్, జనవరి 23 : రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాగా రంగారెడ్డి జిల్లా నిలిచింది. తెలంగాణ ఎకానమీ-2023 పేరిట రాష్ట్ర ప్రణాళికా విభాగం ఓ నివేదిక విడుదల చేసింది. ఇందులో తలసరి ఆదాయం ప్రకారం రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాల జాబితాను పేర్కొంది. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాల జాబితాలో రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు వరుసగా ఆ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి.

తెలంగాణ ఎకానమీ-2023 ప్రకారం రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.8,15,996. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ. 4,03,214. మూడో స్థానంలో నిలిచిన సంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ. 3,08,166గా ఉంది. ఈ గణాంకాల ప్రకారం హైదరాబాద్ వాసుల కంటే రంగారెడ్డి జిల్లా వాసులే ఎక్కువ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఐటీ హబ్ కారణంగానే రంగారెడ్డి రిచెస్ట్ జిల్లాగా మారిందని నిపుణులు చెబుతున్నారు. స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడీడీపి) పరంగా కూడా తెలంగాణలోని జిల్లాల జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. జిల్లా తలసరి ఆదాయం ఆ ప్రాంతంలోని వ్యక్తుల సంవత్సర సగటు ఆదాయాన్ని తెలియజేస్తోంది. ఇక, తలసరి ఆదాయం ఆధారంగా దేశంలో టాప్-10 ధనిక రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఈ జాబితాలో సిక్కిం మొదటి స్థానంలో ఉండగా.. గోవా రాష్ట్రం రెండో స్థానంలో ఉంది.

డైరీని ఆవిష్కరించిన కలెక్టర్



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిజామాబాద్అర్బన్, జనవరి 23: వ్యవసాయ శాఖ అధికారుల డైరీని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. వ్యవసాయ అధికారులు, రైతులకు ఉపయోగపడే విధంగా ఈ డైరీని తీసుకువచ్చారని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్, తెలంగాణ అగ్రి డాక్టర్ అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ రవీందర్, జిల్లా అధ్యక్షుడు వి.గోపి, ప్రధాన కార్యదర్శి హీరాజాదవ్, సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత

● ఏసీపీ హామీతో శాంతించిన ఇరు వర్గాలు



రాస్తారోకో చేస్తున్న వారిని సముదాయిస్తున్న పోలీసులు

రుద్రూరు, జనవరి 23 : రుద్రూరు మండలంలోని సులేమాన్‌ఫారం గ్రామంలో మంగళవారం ఇరు వర్గాల మధ్య చోటు చేసుకున్న ఉద్రిక్తత పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో ఇరు వర్గాల ప్రజలు శాంతించారు. అయోధ్యలో బలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలో శోభయాత్ర నిర్వహిస్తుండగా టపా సులు కాలుస్తున్న సందర్భంగా ఒక వర్గానికి చెందిన ఇంటిపై పడటంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ విషయంలో ఇరు వర్గాల పెద్దలు మంగళవారం కూర్చుని మాట్లాడుతుండగా ఒక వర్గానికి చెందిన వ్యక్తులపై ఇంకో వర్గానికి చెందిన వారు దాడికి పాల్పడ్డారు. దీంతో ఆగ్రహానికి గురైన విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్, రుద్రూరు సీఐ జయేష్, ఎస్‌ఐలు సంఘటన స్థలానికి చేరుకుని రాస్తారోకో చేస్తున్న వారిని సముదాయించారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమిం చారు. ఈ రాస్తారోకోలో గ్రామస్థులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లకు టెండర్ల ఆహ్వానం

బోధన్ రూరల్, జనవరి 23: బోధన్ పట్టణంలో ప్రసిద్ధి గాంచిన ఏక చక్రేశ్వర శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా జాతర ఏర్పా ట్లలలో భాగంగా రంగులు, క్యూ లైన్, బారికేడ్లు, లైటింగ్, డెకరేషన్, సౌం డ్ సిస్టమ్, పూల అలంకరణ తదితర వాటి కోసం టెండర్లను ఆహ్వాని స్తున్నట్లు ఆలయ కమిటీ ఈవో రవీందర్‌గుప్త, శివాలయం కమిటీ ఛైర్మన్ బీర్కూర్ బుజ్జి తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 26వ తేది మధ్యాహ్నం 12గంటల లోపు టెండర్ దరఖాస్తులను శివాలయ కార్యాలయంలో అందజేయాలన్నారు. అందే రోజు ఎంపికైన వారి పేర్లను ప్రకటి స్తామన్నారు.

టీయూ పరిధిలో పీజీ, ఇంటిగ్రేటెడ్ పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి, జనవరి 23: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ, ఇంటిగ్రేటెడ్ అనుబంధ కళాశాలల పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమైనట్లు సీవోఈ ప్రొ.అరుణ తెలిపారు. అనుబంధ కళాశాలలలో ఎంఏ, ఎంకాం,ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ, పీజీఇంటిగ్రేటెడ్ ఏపీసీ,ఐపీసీహెచ్, ఐఎంబీఏ, 3,5,7,9వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయని సీవోఈ తెలిపారు.ఈపరీక్షలకు ఉదయం 1708, విద్యార్థులకు 1618మంది పరీక్షకు హాజరయ్యారని, 90మంది గైర్హాజరయ్యాని, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 181విద్యార్థులకు గాను పూర్తిస్థాయిలో హాజరయ్యారని ఆమె పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో భాగంగా రిజిస్ట్రార్ యాదగిరి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భవనంలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలను, కేంద్రాలకు అనుమతించొద్దని పరీక్షల నిర్వాహకులకు సూచించారు.రిజిస్ట్రార్ వెంట కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.ఆరతి, అడిషనల్ కంట్రోలర్ సాయిలు, తదితరులు ఉన్నారు.

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

సుభాష్‌నగర్, జనవరి 23: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ పుట్టిన రోజు జిల్లా టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్లమెంటరీ అధ్యక్షులు దేగాం యాదాగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని తన యువగళంతో ఆంధ్రప్రదేశ్‌లో ముందుకు తీసుకెళ్తున్నాడన్నారు.ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, దంతాల ఆనంద్, బొబ్బ నర్సింహారావు, సత్యనారాయణ, శ్రీనివాస్, గోవర్ధన్‌గౌడ్, రాములు, ఫిరోజ్, రాజేశ్వర్, గంగారాం పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు



టీయూ నేతాజీ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు



గడ్కోల్‌లో ...



బాల్కొండలో ..



ధర్పల్లిలో ...



బోధన్‌లో..

డిచ్‌పల్లి,జనవరి 23: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని తెలంగాణ యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. అనంతరం ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడు శివా మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలనకు భారతదేశం స్వాతంత్ర్య ఉద్యమంలో భారతీయ విప్లవకారుడు సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ రేడియో నుంచి ఆంగ్లం , హిందీ , బెంగాలి, తమిళం, తెలుగు గుజరాతీ మరియు పోస్ట్ భాషలలో ప్రసంగించారని పేర్కొన్నారు.విద్యార్థులంతరు నేతాజీని ప్రేరణగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ప్రమోద్, సంతోశ్, అమృత్ చారి, సాయికుమార్, తరుణ్, చక్రి, ప్రసాద్ పాల్గొన్నారు.

ధర్పల్లి: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎండీవో లక్ష్మణ్, ఎంపీవో రాజేష్, డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: సుభాష్ చంద్రబోస్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘం బోధన్ డివిజన్ కార్యదర్శి రాజన్న డిమాండ్ చేశారు. మంగళవారం సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌తో పాటు మండలంలోని కల్దుర్కి గ్రామంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ప్రభుత్వం సుభాష్‌చంద్రబోస్ జయంతినిసెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పేదప్రజల కోసం బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతి రేకంగా పోరాటం చేసి తన ప్రాణాలను లెక్క చేయకుండా అనే ఉద్యమాలు చేపట్టిన ఘనత సుభాష్ చంద్రబోస్‌దేనని ఆయన చేసిన సేవలను కొనియాడారు. నేటి యువత సుభాష్ చంద్రబోస్ అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు గంగాప్రసాద్, శివకుమార్, సాయి, రమణ, కల్దుర్కిలో జనని యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను మంగళవారం మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్రం కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సందీప్, జగన్, విఠల్, కృష్ణ, లస్మన్న తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: స్వాతంత్ర్య సమర యోధుడు ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు సిరికొండ మండలంలో యువకులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘనంగా నివాళి అర్పించారు. సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నవయువ యూత్ అధ్యక్షుడు సంద్ర శంకర్ పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. సర్పంచ్ దేవగౌడ్,రఘురాజ్, స్వామి,రంజిత్, కారల్ మార్క్స్,ఫారూక్,నరేష్‌సుభాష్,ప్రతాప్‌రవి,శ్రావణ్,సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండలో ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నేతాజీ జయంతి

సంఘం ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నేతాజీ చిత్రపటానికి సంఘం నేతలు గంగాధర్,మోతీలాల్, సురేష్, పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సుభాష్ యువజన సంఘం అధ్యక్షుడు అవధూత గంగాధర్ నేతాజీ విగ్రహానికి పూలమాల వేయగా సంఘ సభ్యులు ఘన నివాళులు అర్పించి ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాలను గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సంతోష్ వివరించారు.కార్యక్రమంలో గోపి,గ్యామ శోభన్,లక్ష్మీనారాయణ,ప్రకాష్,మారుతి, బచ్చు మారుతి,వినీత్,కిరణ్,సురేష్,నరేందర్,తదితరులు పాల్గొన్నారు.

మాతృభూమి కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు

భారత స్వాతంత్ర్య సమరంలో అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప నేత అని సత్యాశోధక్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ఆర్.నర్సయ్య కొనియాడారు.అంతకు ముందు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నేతాజీ చిత్రపటానికి టీచర్లతో కలిసి పూలమాల వేసినివాళులు అర్పించారు.

వర్ని: మండల కేంద్రంలో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ వర్ని నగర కార్యదర్శి ప్రవీణ్, సంజయ్, సతీష్, ఆశారాం, గురుదాస్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ముప్కాల్, బాల్కొండ మండలాల్లో ఘనంగా నిర్వహించారు. బాల్కొండ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అర్గుల చిన్నయ్య సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశం కోసం తనసర్వస్వాన్ని త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. సుభాష్‌చంద్రబోస్ సూచించిన మార్గంలో నడవాలని విద్యార్థులకు వివరించారు.ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆర్మూర్ నాయకులు నేతాజీకి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్ రెడ్డి, నిజాంసాగర్ ప్రాజెక్టు మాజీచైర్మన్ మిర్దాపల్లి సాయిరెడ్డి, మునిపల్లి సాయిరెడ్డి, మంథని శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీవన్, మాజీసర్పంచ్ మారుతిరెడ్డి,పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడుశ్రీకాంత్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: ఆజాద్‌హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు దేశస్వాతంత్రం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను బషీరాబాద్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌సక్కరం అశోక్, ఉపసర్పంచ్ కస్తూరి విక్రమ్, గ్రామస్థులు నేల్ల రమేష్, బైకాని మహేష్ రమేష్, తోట అప్పయ్య, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

‘పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం’



చెక్కులను పంపిణీ చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, జనవరి 23: పేదల సంక్షేమ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతోందని, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో సమన్యాయం జరుగుతోందని రూరల్ ఎమ్మెల్యే డా.రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను డిచ్‌పల్లి మండల పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా నెరవేరుస్తోందని, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అధికారం పోయిన అహంకారపు మాటలు తగ్గడం లేదని, ప్రజా తీర్పును గౌరవించాలని బీఆర్ఎస్ నేతాలకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు, కురపాటి గంగాధర్, వాసుబాబు, ధర్మగౌడ్, వెంకటచౌకి, సాయిరెడ్డి, ఇబ్రహీం, మోహిన్, నసీమ్ పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలబడుతోందని, వారికి ఎప్పుడూ అండదండగా నిలుస్తోందని, పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 156 చెక్కులు పంపిణీచేశారు. రూరల్ మండలానికి చెందిన 72 మంది లబ్ధిదారులు చెక్కులు అందుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను ఎన్నికల్లో గెలిచిన తర్వాత అన్ని మండలాల్లో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నానన్నారు. మండలాల్లోని ముఖ్యమైన సమస్యలను ముందుగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే భూపతిరెడ్డి హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ అనిరుద్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ హరీష్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరికొండ: మండలం తూంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సమక్షంలో కాంగెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన తూంపల్లి మాజీ సర్పంచ్ బూస దేవరాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నరిగే పెద్ద గంగారాం,తలారి గంగాధర్,తోయేటి సంతోష్,నరిగే గంగాధర్,గడీల గంగారాం తదితరులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువాలను కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈవో



మోకన్‌పల్లి కేజీబీవీలో మాట్లాడుతున్న డీఈవో

నవీపేట,జనవరి23: రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షలలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చూడాలని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని మోకన్‌పల్లి కేజీబీవీ పాఠశాల, నవీపేట జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల పాఠశాలతో పాటు మహంతం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేజీబీవీ, జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల పాఠశాలల ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. 10వ తరగతి సిలబస్‌ను పూర్తి చేసి రివిజన్ టెస్టులను నిర్వహించాలని ఉదయం, సాయంత్రం వేళలో ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

రాత్రి నిర్ధేశించిన సమయానికి దుకాణాలు మూసివేయాలి : సీపీ

● నిబంధనలు అతిక్రమించే వ్యాపారస్తులపై చర్యలు

ఖిల్లా, జనవరి 23: పోలీసు కమీషనరేట్ పరిధిలో పోలీసుశాఖ ద్వారా నిర్ధేశించిన సమయానికి కట్టుబడి ఉండి దుకాణాలను సకాలంలో మూసివేసుకోవాలని పోలీసు కమీషనర్ కల్మేశ్వర్‌శిగనేవార్ తెలిపారు. రాత్రి కేటాయించిన సమయంలోపు మూసివేయాలని, అందుకు సంబంధిత యజమానులు తప్పకుండా పోలీసు శాఖకు సహకరించాలని, నిబంధనలు అతిక్రమించే వారిపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోందని సీపీ హెచ్చరించారు. అత్యవసరమైన విభాగాలు ఆస్పత్రులు, మెడికల్స్, సినిమాహాల్స్ తప్ప మిగతావన్ని ప్రతి రోజు రాత్రి కేటాయించిన సమయంలోపు మూసివేయాలని తెలిపారు. రాత్రి సమయంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించే సిబ్బందికి ఏదైనా షాపు వారు తెరచి ఉన్నట్లు కనబడితే అటువంటి షాపు యాజమాన్యంపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరు కూడా శాంతి భద్రతలకు విఘాతం కలిగించడానికి ప్రయత్నించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలన్నారు.

దేగాంలో చోరీ

ఆర్మూర్‌టౌన్,జనవరి23: మండలంలోని దేగాం గ్రామంలో మంథని గంగుబాయి అనే మహిళ మెడలో నుంచి రెండున్నర తులాల బంగారం చోరీకి గురైంది. మంగళవారం తన ఇంట్లో గంగుబాయి గుర్తుతెలియని దొంగ చొరబడి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కొని ఎత్తుకెళ్లాడు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు

బోధన్ రూరల్, జనవరి 23: పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్ఐ నాగ్‌నాథ్ తెలిపారు. సోమవారం బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి వద్ద నుంచి రూ.2,500 నగదును స్వాధీన పరచుకున్నామన్నారు. మండలంలోని ఏ గ్రామం లోనైనా పేకాట ఆడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసులు తదితరులు ఉన్నారు.

సిద్ధాపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం

వర్ని,జనవరి23:మండలం సిద్ధాపూర్ గ్రామశివారులో నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్ పనులను మంగళవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మందకొడిగా సాగడంతో స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నిర్మాణ పనులను పరిశీలించారు. అనుకున్న షెడ్యూల్ ప్రకారం మిగాత పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఇరిగేషన్ అధికారులకు సూచించారు. పనులు పూర్తయితే వర్ని, గాంధారి, బాన్సువాడ ప్రాంతాల్లోని నిజాంసాగర్ ప్రాజెక్టు నాన్ కమాండ్ ఏరియా రైతాంగంకు రెండు పంటలకు సాగునీటి వసతి అందుబాటులోకి రానుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట జడ్పీటీసీ హరిదాస్, మేక వీర్రాజు, గోపాల్, బాల్‌సింగ్, మాజీ ఎంపీటీసీ సాయగౌడ్, సర్పంచ్ ప్రభ దేవేందర్, తదితరులున్నారు.

బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

బోధన్ రూరల్, జనవరి 23: బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్ అన్నారు. మంగళవారం ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి, సాటాపూర్ చౌరస్తా, రెంజల్ మండలంలోని వీరన్నగుట్ట, బోధన్ మండ లంలోని కుమ్మన్‌పల్లి గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్న దుకాణాలలో తనిఖీలు చేపట్టి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లోని బెల్టు షాపుల్లో మద్యాన్ని విక్ర యిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహారాష్ట్ర దేశీదారు మద్యాన్ని విక్రయించినా సరఫరా చేసినా శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తే స్థానికులు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్,జనవరి 23: నేడు నగరంలోని సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నగర టౌన్-2 ఏడీఈ తోటరాజశేఖర్ తెలిపారు. సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పాముల బస్తీ, పాలిటెక్నిక్, బ్యాంక్ కాలనీ, కంఠేశ్వర్, మీసేవా ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఉదయం 8గంటల నుంచి 10.30ల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.135	రూ.205	రూ. 225
వెన్‌కాబ్(కిలో)	: రూ.140	రూ.210	రూ. 230

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,100	రూ.59,100	రూ.750

సినిమా గైడ్ నిజామాబాద్



పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : హనుమాన్ (9.40, 1.00, 4.20, 7.40, 11.00)
స్క్రీన్-2 : హనుమాన్ (హిందీ) (12.00, 10.00)
: గుంటూరుకారం (3.20)
: హనుమాన్ (తెలుగు) (6.40)
స్క్రీన్-3 : గుంటూరుకారం (11.35, 6.20, 9.40)
: కొత్తరంగుల ప్రపంచం (2.55)
స్క్రీన్-4 : నా సామిరంగ (12.40, 6.50, 10.00)
: సైంధవ్ (3.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : నా సామిరంగ (1.35, 4.35, 10.45)
: గుంటూరుకారం (7.40)
స్క్రీన్-2 : గుంటూరుకారం (10.25, 4.20, 10.30)
: సైంధవ్ (1.30, 7.30)
స్క్రీన్-3 : హనుమాన్ (10.30, 1.30, 4.30, 7.35, 10.35)



దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహోల్ : గుంటూరుకారం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : నా సామిరంగ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సైంధవ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్